తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
బుధవారం 17 జూన్ 2026
పేజీలు : 8





## బ్రహ్మోత్సవాల పోస్టల్ ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

### బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశం

**కనగల్లు, జూన్ 16 (జనం సాక్షి)** ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు (జాతర) అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ పాలకమండలితో కలిసి హైదరాబాదులోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి చేతుల మీదుగా బ్రహ్మోత్సవాల పోస్టర్ను ఆవిష్కరణ చేశారు. ఇదిలా ఉంటే మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్య లో భక్తులు వస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులతో పాటు పాలకమండలి సభ్యులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈనెల 23న (మంగళవారం) బ్రహ్మోత్సవాల కార్యక్రమాలతో ప్రారంభమై 24న (బుధవారం)జమదగ్ని మహాముని ఎల్లమ్మల కళ్యాణం జరుగుతున్నందున ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, 25న (గురువారం) శతకటాభిషేకం సాయంత్రం ధర్వేశిపురం, పర్వతగిరి గ్రామాలచే ఇంటింటి బోనాలను తీసి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తారని చైర్మన్ వెంకట్ రెడ్డి వివరించారు. మూడు రోజులు జరిగే కార్యక్రమాలలో ఎల్లమ్మ చరిత్ర యక్షగానం, వివిధ రూపాలలో కోలాటాల బృందాల ఆటపాటలు, శివ సత్తుల విన్యాసాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే భాస్కర్, ఆలయ కార్యనిర్వానదికారి అంబటి నాగిరెడ్డి, మాజీ చైర్మన్ నేలగందరాసి ముత్తయ్య ధర్మకర్తలు కే శంకర్ రెడ్డి, ఎం గణేష్ మోహన్, కే పరమేష్, కే శ్రీను, ఎం రమణ, ఎన్ వెంకన్న, ఎన్ తిరుపతయ్య, ఎన్ యాదగిరి, ఎం మహేష్, జి సైదులు, పి సత్యనారాయణ, ఎన్ వెంకటేశ్వర్లు, సిహెచ్ రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు నాగోల్ మల్లాచారి, గాదె దామోదర్ రావు, సీనియర్ అసిస్టెంట్ జై చంద్రయ్య, జూనియర్ అసిస్టెంట్ కే ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో ఓటు విలువ పెరిగింది

### అర్హుల ఓటు ఒక్కటి కూడా పోకుండా పని చేయాలి

### కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మర్రిగూడ, జూన్16(జనంసాక్షి)** మునుగోడు నియోజకవర్గంలో ఓటు విలువ పెరిగిందని, ఇతర ప్రాంతాల్లో ఓటు ఉన్నప్పటికీ మునుగోడులోనే ఓటు కొనసాగించాలనే స్థాయికి నియోజకవర్గం ప్రత్యేక గుర్తింపు పొందిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటు అనేది సామాన్యుడి చేతిలో ఉన్న వజ్రాయుధమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే మంచి నాయకుడిని ఎన్నుకోవాలని, మంచి నాయకుడిని ఎన్నుకోవాలంటే ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలని అన్నారు. అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగించబడకుండా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పీసీసీ తరఫున నియమితులైన మాస్టర్ ట్రైనర్ నూమన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. మ్యాపింగ్, అన్‌మ్యాపింగ్ ఓటర్లు, ఓటర్ల మార్పులు–చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు, ఇతర ప్రాంతాల్లో ఓటు కలిగిన వారి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కైలాష్ నేత మాట్లాడుతూ, మునుగోడు నియోజకవర్గంలో మార్పులు, చేర్పులు అవసరమైన ఓటర్ల సంఖ్య సుమారు 91 వేల వరకు ఉందని తెలిపారు. ఈ అంశాన్ని బీఎల్ఏలు అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించబడకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు అడిగిన పలు సందేహాలకు మాస్టర్ ట్రైనర్ నూమన్ సమాధానాలు ఇచ్చి స్పష్టత కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గం లోని బీఎల్ఏలతో పాటు మున్సిపల్ చైర్మన్లు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సాయినాధుని దర్శించుకున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**చింతపల్లి, జూన్ 16(జనంసాక్షి):** చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా 19వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకలు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ బాబాని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ, కమిటీ సభ్యులు, అర్చకులు ఆయనకు ఆహ్వానం పలికి వేద ఆశీర్వచనం చేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఇంతటి ప్రశాంతమైన వాతావరణంలో స్వామి వారి వార్షికోత్సవాలు ప్రత్యేకంగా నిర్ణయించుకోవడం చెప్పుకోదగ్గ విషయం. అదేవిధంగా గోశాలను కూడా ఆలయ నిర్వాహకులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వాహణ చేపట్టడం హిందూ ధర్మ పరిరక్షణకు ఇది నిదర్శనం అన్నారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆర్ఎస్ ప్రవీణ్ తో పాటు, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి ని వీరితోపాటు ముఖ్య నాయకులను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ దిశగా చారిత్రాత్మక ప్రగతి

### డా. బూర నర్సయ్య గౌడ్

వార్తా లోపలి పేజీలో



## దోమలవాగు మినీ రిజర్వాయర్ అభివృద్ధికి ఎమ్మెల్యే పాయం శ్రీకారం

### రూ.20లక్షలతో యూటి పనులకు భూమిపూజ



**బూర్గంపహాడ్ జూన్ 16 (జనంసాక్షి)** దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్ అభివృద్ధి చేసి రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా కల్పించే లక్ష్యంలో భాగంగా నకిరిపేట పంచాయతీలోని దోమల చెరువుకు సీతారామ సాగునీటిని మళ్లించేందుకు రూ.20లక్షలతో నిర్మించనున్న యూటీ పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ఈ రిజర్వాయర్ పూర్తయితే ఈ ప్రాంతంలో సుమారు 16వేల ఎకరాల్లో రైతుల భూములకు సాగునీరు అందుతుందని తద్వారా సీతారామ నీటితో ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. అశ్వాపురం, బూర్గంపహాడ్ మండలాల్లో ప్రతి ఎకరానికి సీతారామ కాలువ ద్వారా గోదావరి జలాలు అందేలా కృషిచేస్తామని రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ గణేషానాయక్, తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, భజన ప్రసాద్, బాదం రమేష్ రెడ్డి, సర్పంచ్లు సర్పా నాగమణి, మందా నాగరాజు, బానోత్ నరసింహ, వారాల వేణు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, సుధాకర్రెడ్డి, పూలపెల్లి సుధాకర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ దిశగా చారిత్రాత్మక ప్రగతి : డా. బూర నర్సయ్య గౌడ్

**భువనగిరి ప్రతినిధి, జూన్ 16(జనంసాక్షి)**
భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక పురోగతి, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠ పెరిగిన విధానాన్ని వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు మోదీ ప్రభుత్వం పరిష్కారం చూపిందన్నారు. "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్" అనే సిద్ధాంతంతో సమాజంలోని ప్రతి వర్గాన్ని అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేస్తూ దేశాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం అమలు చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా కోట్లాది కుటుంబాలకు పక్కా గృహాలు అందించబడగా, ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా మహిళలకు పొగరహిత వంటగదులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది మంది బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారని, ఆర్థిక సమ్మిళితానికి ఇది ఒక విప్లవాత్మక అడుగుగా నిలిచిందన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఆఐ) ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేరుతున్నాయని చెప్పారు.

ఆరోగ్య రంగంలో ఆయుష్మాన్ భారత్ ? ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా పేద కుటుంబాలకు భారీ ఆరోగ్య భద్రత కల్పించబడిందని, దేశవ్యాప్తంగా వేలాది ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి కోట్లాది మంది ప్రాణాలను కాపాడిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొంటూ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నారని, పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా పంట నష్టాలకు బీమా రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. సోయిల్ హెల్త్ కార్డులు, సూక్ష్మ నీటిపారుదల పథకాలు, వ్యవసాయ మౌలిక వసతుల నిధి, ఈ-నామ్ (వ-ఔంఓ) వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తున్నారని చెప్పారు.

మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, బేటీ బచావో ? బేటీ పడావో, మాతృ వందన యోజన, సుకన్య సమృద్ధి యోజన, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం వంటి పథకాల ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక, విద్యా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ మరియు శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే నారీ శక్తి వందన్ చట్టం మహిళాసాధికారతకు చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.

యువత కోసం స్టార్ట్ అప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, ముద్రా యోజన, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు అమలు చేసి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచారని తెలిపారు. భారత్ నేడు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఎదగడం యువత సామర్థ్యానికి, ప్రభుత్వ ప్రోత్సాహానికి నిదర్శనమని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల రంగంలో గత 12 సంవత్సరాలు స్వర్ణయుగంగా నిలిచాయని ఆయన అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి, రైల్వే ఆధునీకరణ, వందే భారత్ రైళ్లు, సరుకు రవాణా కారిడార్లు, మెట్రో రైలు ప్రాజెక్టులు, కొత్త విమానాశ్రయాల నిర్మాణం, పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్ రంగ సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందించే లక్ష్యంతో భారీ కార్యక్రమాలు చేపట్టారని, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా పారిశుధ్య విప్లవం తీసుకువచ్చారని చెప్పారు. కోట్లాది మరుగుదొడ్లు నిర్మించడం ద్వారా ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. డిజిటల్ విప్లవం గురించి ప్రస్తావిస్తూ, యూపీఐ, భీమ్, ఆధార్ ఆధారిత సేవలు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థల ద్వారా భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడంతో పాలనలో పారదర్శకత, వేగం పెరిగిందని తెలిపారు.








పారిశ్రామిక రంగంలో మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఖఒఎ) పథకాల ద్వారా మొబైల్ తయారీ, ఎలక్ట్రానిక్స్, రక్షణ ఉత్పత్తులు, ఆటోమొబైల్, సెమీకండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులు ఆకర్షించామని పేర్కొన్నారు. ఒకప్పుడు మొబైల్ ఫోన్ల దిగుమతులపై ఆధారపడిన భారత్ నేడు ప్రపంచంలోనే ప్రధాన మొబైల్ తయారీ కేంద్రంగా ఎదిగిందని తెలిపారు. జాతీయ భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడలేదని, సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు సాయుధ దళాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించిందన్నారు. రక్షణ రంగంలో స్వదేశీ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి భారత్‌ను ఆయుధాల తయారీలో స్వయం సమృద్ధి వైపు నడిపిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్ఠ గణనీయంగా పెరిగిందని పేర్కొంటూ, జీ-20 సదస్సు విజయవంత నిర్వహణ, ప్రపంచ దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, ప్రపంచ సంక్షోభాల సమయంలో భారత్ పోషించిన నిర్మాణాత్మక పాత్ర కారణంగా దేశ గౌరవం మరింత పెరిగిందన్నారు. నేడు ప్రపంచ దేశాలు భారత్ వైపు ఆశతో చూస్తున్నాయని తెలిపారు.

# గంజాయి పట్టివేత

## ఇద్దరు నిందితులు అరెస్టు.. రిమాండ్..

**బూర్గంపహాడ్ జూన్ 16 (జనంసాక్షి):** ద్విచక్రవాహనంపై అక్రమంగా గంజాయి తరలిస్తూ బూర్గంపహాడ్ పోలీసులకు ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...ఒడిస్సా నుంచి ములుగు జిల్లా మంగపేటకు బజాజ్ పల్సర్ వాహనంపై అక్రమంగా 2.1 కిలోల గంజాయి తరలిస్తుండగా ములుగుజిల్లా మంగపేటకు చెందిన బడే భరత్, ఉప్పరపల్లి వెంకటేష్లను మండల పరిధిలోని సారపాక పల్లెప్రకృతివనం వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 1.5లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయితో పాటు ద్విచక్రవాహనం, రెండు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకుని పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.





# అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలి

**బీబీనగర్ (జనంసాక్షి):**
ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం తోపాటు అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ కు ప్రతినెల 1వ తేదీన వేతనం చెల్లించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వం నిర్ణయం చేసిన ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ మొత్తం 4131 కేంద్రాలను తక్షణమే రద్దు చేయాలని ఈ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగిస్తూ వెంటనే ప్రభుత్వం నిర్ణయం చేయాలి ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బీబీనగర్ మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాడి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ టీచర్స్ గత 50 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వీరంతా మహిళలు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికలు ఉన్నారని, నేటికి వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు రూ.1800 వేలు వేతనం పెంచుతామని పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన వాటిని అమల్లోకి తేవడం లేదని విమర్శించారు. ఖాళీ పోస్టులు భర్తీ తదితర ఇంకా అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయి, వీటన్నిటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు . ఈ కార్యక్రమంలో అండ్ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు సుజాత, కార్యదర్శి షాహిదా, ధనలక్ష్మి, విశాల, శారద, ధనమ్మ, సుజాత, నాగలక్ష్మి ,శోభారాణి, సరస్వతి, సంతోష, బాలమణి, లక్ష్మి, రాధిక, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# పండెన్డ్ ఏళ్ల పాలనను అభివృద్ధి సంక్షేమమే ప్రధమ ఏజెండా

**కనగల్లు, జూన్ 16 (జనం సాక్షి)**
కేంద్రంలో ప్రధానినరేంద్ర మోడీ నాయకత్వంలో 12 ఏళ్ల పాలనలో అభివృద్ధి సంక్షేమమే ప్రధాన ఎజెండగా పాలన ముందుకు సాగుతుందని జిల్లా పార్టీ మాజీ అధ్యక్షులు వేరెల్లి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ తన ఆలోచన మేధాశక్తితో సేవల సంక్షేమం, యువశక్తి, రైతు సంక్షేమం, మహిళల సాధికారిక, ఆరోగ్యం, పేద మధ్యతరగతి సంక్షేమం, దేశ నిర్మాణం, వికాసం తదితర వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిండి పాపిరెడ్డి, పులకరం బిక్షం, తీరం తిరందాసు కనకయ్య, పీ. బిక్షం, దాసరి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు



# నూతన నియామకం

**సూర్యాపేట (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా తనను నియమించినట్లు జిల్లా కేంద్రానికి చెందిన దేవరశెట్టి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లోతెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.





## పశువులకు గొంతువాపు టీకాలు

**మండలంలో వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశం**

**టీకాల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జేడీ డాక్టర్ జి.వి. రమేష్**

**మాడుగులపల్లి, జూన్ 16 (జనంసాక్షి):**
మండల పరిధిలోని గంద్రవాని గూడెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి, జాయింట్ డైరెక్టర్ (జేడీ) డాక్టర్ జి.వి. రమేష్ ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన పాడిరైతులతో మాట్లాడి పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు వర్షాకాలం ప్రారంభమైనందున పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ముందు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలని కోరారు.అనంతరం మాడుగులపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్‌ను అడిగి మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న టీకాల పంపిణీ వివరాలను జేడీ తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గంద్రవాని గూడెం గ్రామ సర్పంచ్ బొబ్బలి కావ్య శ్రీనివాస్, జూనియర్ వెటరినరీ ఆఫీసర్ రవి చందర్, వ్యాక్సినేటర్ రాకేష్, పాడిరైతులు మాధవ రెడ్డి, సతీష్, రవి, నారాయణ, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ మార్కండేయకు ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**ఫిజియోథెరపీ చికిత్స కోసం తక్షణ స్పందన**

**చౌటుప్పల్ జూన్ 16(జనంసాక్షి)**



వంశపారంపర్య అనారోగ్య సమస్యతో తీవ్రంగా బాధపడుతూ, నడవలేని స్థితికి చేరుకున్న నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం, రామలింగాలగూడెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఉరె మార్కండేయకు ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అండగా నిలిచారు.పలువురు దాతల ఆర్థిక సహాయంతో, వైద్య నిపుణుల సలహా మేరకు మార్కండేయ ఇటీవల రేడియేషన్ ట్రీట్మెంట్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. అయితే, చికిత్స అనంతరం సాధారణ జీవితానికి తిరిగి రావడానికి సుదీర్ఘమైన ఫిజియోథెరపీ చికిత్స అత్యవసరమని వైద్యులు స్పష్టం చేశారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆ చికిత్స పొందడం సాధ్యం కాక ఆయన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు.ఈ విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ దృష్టికి తీసుకు వెళ్ళగా, ఆయన తక్షణమే స్పందించి, ఆర్థిక సాయాన్ని ఆన్‌లైన్ ట్రాన్స్ఫర్ ద్వారా అందించారు.




## జూన్ 20న జాతీయ లోక్ ఆడాలాట్

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 16 (జనంసాక్షి)**
నేడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీమతి పి.దేవి మానస బ్యాంకర్లు చిట్ఫండ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జిరాజగోపాల్ మాట్లాడుతూ జూన్ 20న జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నట్లు రాజీ చేసుకోవాలనుకునే వారు దీన్ని సద్వినియోగం చేసుకొని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని సూచించారు అదేవిధంగా రాబోయే జాతీయ లోకా ఆదాలత్ ను అందరూ ఉపయోగించుకోవాలని ఎక్కువ సంఖ్యల రాజీ పడాలని" రాజియే రాజ మార్గమని" అన్నారు. లోక్ ఆదాలత్ లో రాజీ పరుచుకునే వారు అప్పిలు అనగా పై కోర్టులకు వెళ్లే అవసరం ఉండదని అన్నారు. ఖమ్మం కోర్టులో 2,733 ఔఎ ఞఇబి కేసులు మరియు 1118 ఇన్సూరెన్స్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని వీటన్నింటిని రాజీపరిచేలా పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో బార్ ప్రెసిడెంట్ వై. రమేష్ బార్ కౌన్సిల్ మెంబర్ ఎమ్. శ్రీనివాస్ మరియు ఇతర చిట్ఫండ్ కంపెనీలు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## అర్హత కలిగిన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను**

**తిరుమలాయపాలెం జూన్ 17 (జనంసాక్షి)**
అర్హత కలిగిన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను డిమాండ్ చేశారు తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామము లో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సమావేశానికి శాఖ కార్యదర్శి వీరబోయిన నాగయ్య అధ్యక్ష వహించారు మండలంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని రాజకీయాలతో సంబంధం లేకుండా పేదలకు ఇల్లు ఇవ్వాలని తిరుమలాయపాలెం మండలంలో దళితవాడలో కాలనీ ఇండ్లలో కూలిపోయి పాత పెంకుటిండ్ల స్థానంలో కొత్త ఇండ్లు మంజూరు చేయాలని పేరుకి ఇండ్లు ఉన్నట్టు ఇంటి నెంబరు ఉండి ఇల్లు ఉన్నట్టు ఉన్న కానీ ఆ యొక్క ఇల్లు కూలిపోయే దశలో ఉందని అందుకు ప్రభుత్వం ఆలోచించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో సిపిఎం మండల నాయకుడు కొత్తపల్లి వెంకన్న వశ పొంగు వీరన్న నిర్సుల వెంకటేష్ కొత్త మధు గుండాల వెంకన్న పరిపూర్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

## నేడే కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలి

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న**



**తిరుమలాయపాలెం జూన్ 17 (జనంసాక్షి)**
తిరుమలాయపాలెం మండలం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ సంస్థాగత బలోపేతం భవిష్యత్ కార్యాచరణలో భాగంగా బుధవారం17వ తేదీన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు ఇసుక స్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని డి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న తెలిపారు పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరవనీయులు కందాల ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించబడుతోంది.
ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మరియు రాష్ట్ర పార్టీ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షులు, పాలేరు నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇన్‌చార్జి శ్రీ తాతా మధుసూదన్ మరియు జిల్లా, రాష్ట్ర నాయకత్వం పాల్గొననున్నారు. స్థలం: శ్రీహర్ష కన్వెన్షన్ (వెంకటగిరి క్రాస్ రోడ్), పాలేరు నియోజకవర్గం. సమయం: ఉదయం 10:00 గంటలకు పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత పటిష్టంగా నిర్మించే లక్ష్యంతో ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించ బడుతోంది. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ నుంచి ఎంపిక చేసిన బూత్ స్థాయి ప్రతి నిధులు, పాలేరు నియోజక వర్గానికి నియమించబడిన బీఎల్ఏలు, డిజిటల్ మెంబర్‌షిప్ ఇన్‌చార్జీలు (ప్రతి బూత్‌కు ఇద్దరు చొప్పున) ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావలెను. తిరుమలాయపాలెం మండలంలోని ప్రతి బూత్ నుంచి ఇద్దరు చొప్పున, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ముగ్గురు ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాను.

## పేద విద్యార్థులకు అండగా ఉంటాం

**సూర్యాపేట(జనంసాక్షి):**
పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జడ్‌పీహెచ్ఎస్ లో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి సంస్కారం, క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత భావం కలిగి ఉండాలని అన్నారు.పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు.పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు సహాయం చేయాలని కోరారు.విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పురస్కారాలు ఉపయోగపడతాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు అవసరమైన సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు



సిద్ధంగా ఉన్నామని తెలిపారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ పొందుతారని అన్నారు.అనంతరం నగదు పురస్కారాలను అందజేశారు. ఎన్. మేఘనకు లక్ష రూపాయలు, వి.శృతికి రూ.50 వేలు,దీక్షితకు రూ.25వేలు నగదు పురస్కారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెలుగు వెంకన్న, స్కూల్ జిహెచ్ఎం గోలి పద్మ, సజీవ్,ఎన్.రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు గొర్రెపాటి వీరస్వామి,అచ్చా ఉప్పలయ్య ఏకగ్రీవంగా ఎన్నిక

**తిరుమలాయపాలెం జూన్ 17 (జనంసాక్షి):**



అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ తిరుమలాయపాలెం మండలం ఏడవ మహాసభలు గ్రామంలో విజయవంతంగా ముగిశాయి అనంతరం నూతన మండల అధ్యక్ష కార్యదర్శులను మహాసభ ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా గొర్రెపాటి వీరస్వామి బచ్చోడు కార్యదర్శిగా అచ్చా ఉప్పలయ్య తిప్పారెడ్డిగూడెం గ్రామాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ రానున్న రైతాంగ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేస్తామని రైతాంగ గిట్టుబాటు ధరల కోసం వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం కోసం రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు పత్రికా ప్రకటనలో అన్నారు వీరితో పాటు మరో పదకొండు మందిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఉపాధ్యక్షులుగా పేరం వెంకటేశ్వర్లు సహాయ కార్యదర్శిగా మాజీ విజయ్ కోశాధికారిగా ఇందుర్తి శ్రీనివాసరెడ్డి తో పాటు ఆడెపు నగేష్ గుణగంటి లింగయ్య ఈడబోయిన మల్లయ్య కొత్తపల్లి శ్రీను పేరం పట్టాభి తదితరులను నూతన కార్యవర్గంగా ఎన్నుకోవడం జరిగిందని ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు గొర్రెపాటి వీరస్వామి తెలిపారు




## న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలి

**ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ భద్రాచలం యూనిట్ డిమాండ్..**

**భద్రాచలం జూన్ 16 (జనంసాక్షి)**

బార్ కౌన్సిల్లో నమోదైన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలని ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.చైతన్య డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ, తెలంగాణ రాష్ట్ర కమిటీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ ఆవరణలో మంగళవారం న్యాయవాదులతో కలిసి ప్రదర్శించారు. ఈ ధర్నా కార్యక్రమానికి భద్రాచలం బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా భద్రాచలం యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు బండారు అరుణ్ చంద్, పాయం రవివర్మ, జిల్లా కమిటీ సభ్యులు యు గౌతమ్ కుమార్, సీనియర్ న్యాయవాది యం కిషోర్, న్యాయవాదులు ఎ అంజిలి కుమారి, శివకృష్ణ, కోరాడ శ్రీనివాస రావు, విజ్జగిరి రవితేజ, సౌజన్య, పి మధుబాబు, లక్ష్మణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కనీస వేతన అమలు చట్టం ఐటీసీ కర్మాగారంలో అమలుచేయాలి

**యాజమాన్యానికి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వినతి**



**బూర్గంపహాడ్ జూన్ 16 (జనంసాక్షి)**

తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల విభాగాల శాఖ ద్వారా నూతన వేతనాల గురించి జీవో 6ను విడుదల చేసిన విషయం పాఠకులకు తెలిసిందేనని...ఈ కనీస వేతన అమలు చట్టాన్ని ఐటీసీ కర్మాగారంలో కూడా కాంట్రాక్టు కార్మికులకు అమలుచేయాలని ఐటీసీ భద్రాచలం పేపర్బోర్డు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పాటి సోమిరెడ్డి ఐటీసీ కర్మాగారంలో హెచ్ఆర్ విభాగంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. నూతన వేతనాలను 2026 జూన్ 1వ తారీకు నుంచి అమలుచేయాల్సి ఉన్నా ఈ ఉత్తర్వుల ప్రకారం గతంలో ఉన్న కనీస వేతనాల నోటిఫికేషన్లు రద్దుచేయబడి, కొత్త వేతన రేట్లు అమలులోకి వచ్చాయని... తెలంగాణ జీవో 6 ప్రకారం ఐటీసీ కర్మాగారంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనాలను తక్షణమే అమలయ్యేలా చూడాలని కోరారు. వీటితో పాటు వేతన వ్యత్యాస బకాయిలు కూడా చెల్లించాలని ఆ వినతిలో కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ సభ్యులు జి.ఉమామహేశ్వరరావు, మేకల శేషమ్మ, జే.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## తాటి చెట్టుపై నుండి పడి గీతా కార్మికునికి తీవ్ర గాయాలు

**వలిగొండ , జున్ 16 (జనంసాక్షి)**



ప్రమాద వశాత్తు గీతా కార్మికుడు తాటి చెట్టుపై నుండి పడి తీవ్ర గాయాలు అయిన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రెడ్లరేపాక మధిర ఏడు మొట్ల బావి కి చెందిన మాద శ్రీరాము (58) రోజు మాదిరిగా మంగళవారం కల్లు తీయటానికి తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాద వశాత్తు జారీ పడి కాలు చేయి విరిగి పోయి తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని వైద్యం నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ బాధితునికి ఎక్సగ్రేషియా అందించాలని గీతా కార్మిక సంగం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల నాయకుకు గాజుల ఆంజనేయులు, పలుసం స్వామి పలువురు కోరారు.

## జిల్లా కలెక్టర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా వినతిపత్రం..

**ఖమ్మం కార్పొరేషన్ జూన్ 16 (జనంసాక్షి):**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడం తో పాటు, నకిలీ విత్తనాల దందాను ఉక్కుపాదం తో అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్‌కు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ విత్తనాల బెడదను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ఈ ఖరీఫ్ సీజన్ లో జిల్లా వ్యాప్తంగా సుమారు 5.5 లక్షల నుంచి 6 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నా యని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా జిల్లాలో అత్యధికంగా 2.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోందని, ఇందుకు కనీసం 5 లక్షల నుంచి 6 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని వివరించారు. అలాగే 1.5 లక్షల నుంచి 2 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, ఎకరాకు 25-30 కిలోల చొప్పున వేలాది క్వింటాళ్ల సన్న రకాల విత్తనాలు అవసరమని, రెండు లక్షల ఎకరాలకు పైగా మిర్చి, మొక్కజొన్న, అపరాలు సాగవుతున్నాయని తెలిపారు. ఈ భారీ విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచు కుని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద విత్తనాల కొరత లేకుండా సరిపడా నిల్వలు ఉంచాలని, ఏ ఒక్క రైతు విత్తనాల కోసం క్యూ లైన్లలో నిలబడే పరిస్థితి రాకూడదని విన్నవించారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా అందిస్తున్న జీలుగు విత్తనాలు పూర్తిగా పుచ్చిపోయి ఉన్నాయని, వాటి మొలక శాతం కేవలం 25 శాతానికి మించి రావడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చిరొట్టకు వాడే విత్తనాలను సైతం ప్రభుత్వం నాణ్యమైనవే ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ డీలర్లు, విత్తన కంపెనీలు పత్తి, మిర్చి, వరి సాగు చేసే రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అంటగడుతున్నారన రైతులు పెట్టుబడి అంతా పెట్టి, తీరా దిగుబడి రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా నకిలీ పత్తి, మిర్చి విత్తనాల ముఠాల వల్ల అమాయక రైతులు నిలువునా మోసపోతున్నారని, ఈ దందాను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీసు శాఖల సమన్వయంతో



'స్పెషల్ టాస్క్ ఫోర్స్' బృందాలను ఏర్పాటు చేసి, నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై పీడీ యాక్ట్ (ఖఆ ంఇబి) కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్, పార్టీ సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు నరుకుల వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రవి రాథోడ్, నకరికంటి వీరభద్రం, మారుతి వీరభద్ర ప్రసాద్, పార్టీ కోశాధికారి గౌతమ్ లక్ష్మీనారాయణ, బోయినపల్లి శేఖర్, ఆర్ఎస్ యాదవ్, సిరిపురపు ప్రసాద్, నిమ్మటూరి రామారావులతో పాటు పలువురు బిజెపి కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు బంద్ చేయాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం నిర్ణయం

**భద్రాచలం జూన్ 16 (జనంసాక్షి)**



దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాచలంలో మద్యం బెల్ట్‌షాపులను సామూహికంగా బంద్ చేయాలని భద్రాచలంలో మంగళవారం జరిగిన గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొందరు వార్డు సభ్యులు బెల్టుషాపుల బంద్‌పై చర్చకు పట్టుబట్టారు. ఈ సమయంలో తీర్మానంను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రస్తావించగా సభ్యుల అభిప్రాయాలను సర్పంచ్ తెలుసుకున్నారు. ఈ సమయంలో పాలకవర్గ సభ్యులందరూ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో బెల్టుషాపుల బంద్‌కు అనుకూలంగా మాట్లాడారు. దీంతో భద్రాచలంలో ఇకపై బెల్టుషాపులు ఉండకూడదని తీర్మానం చేశారు. అలాగే నివాసాల మధ్య కాలి స్థలాలలో ఇష్టానుసారంగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించకుండా పట్టించుకోని భూ యజమానులకు తొలిత సమాచారం అనంతరం నోటీస్ జారీ చేసే విధంగా తీర్మానం చేసుకున్నట్లు తెలుస్తుంది. రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధాన డ్రైనేజీలను జెసిబి లతో పూడికలు తీయించడంతోపాటు ఇంటి పన్ను తదితర కీలక అంశాలపై పాలకవర్గం పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ పూనెం కృష్ణ, కార్యదర్శి శ్రీనివాస్ తోపాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుక లారీల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి

**- సోంపల్లి ర్యాంపు వద్ద లారీలను అడ్డుకున్న బూర్గంపహాడ్ వాసులు**

**బూర్గంపహాడ్ జూన్ 16 (జనంసాక్షి)**



ఇసుక లారీలు అతివేగంగా రయ్.. రయ్ మంటూ రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నా యని బూర్గంపహాడ్ కు చెందిన రైతులు, ప్రజలు, స్థానికులు సోంపల్లి ర్యాంపు వద్ద లారీలను మంగళవారం అడ్డుకున్నారు. వ్యవసాయ సాగు సమయం కావడంతో రైతులు ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగుమందులు తమ పొలాలకు ఈ దారుల గుండానే వెళ్లాల్సి రావడంతో ఈ దారులను ఎంచుకున్న ఇసుక లారీలు ఇటుగా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లన్నీ గుంతలు పడి అధ్వాన్నంగా మారాయని... తమ వ్యవసాయ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఇసుక ర్యాంపు నిర్వాహకులు దారి మార్చుకుని ఇసుక రవాణా సాగించాలని లేదంటే లారీలను ప్రతిసారీ అడ్డుకుంటామని హెచ్చరించారు. లారీలను అడ్డుకున్న వారిలో బూర్గంపహాడ్ కు చెందిన యువకులు, గ్రామస్థులు, రైతులు ఉన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు తక్షణమే మంజూరు చేయాలి

**బూర్గంపహాడ్ జూన్ 16 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల పేరుతో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి సంవత్సరాల తరబడి బిల్లులు రాకుండా ఆపడం, వారిని తీవ్ర నిరాశకు గురిచేయడం తగదని తక్షణమే పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు బిల్లులు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు జక్కుల రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిరుపేదలు సొంతింటి కలను నెరవేర్చుకోవడం కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారులు ఇల్లు నిర్మించుకుంటే సకాలంలో వారికి బిల్లులు మంజూరు చేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడా కాంట్రాక్టర్లు, కార్పోరేట్లకు తక్షణమే బిల్లులు చెల్లించే ఈ ప్రభుత్వం పేదవాడికి సొంతి ఇంటి కోసం నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సకాలంలో మంజూరు చేయడంలో ఆంతర్యమేమిటో అర్థంకావడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేసి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలని డిమాండ్ చేశారు.

# గ్రామాల్లో కనపడని జీపీఓలు..!




- ఫీల్డ్ కీ వెళ్లకుండా తహసిల్దార్ కార్యాలయం లోనే ప్రత్యక్షం..
- గ్రామాల్లో ఏ దరఖాస్తు వచ్చిన మధ్య వర్తులు ద్వారానే తెప్పించుకుంటున్న వైనం..
- గ్రామల్లో జీపీవోలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

**ఖమ్మం రూరల్,జూన్ 16 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి జీపీవోల నియామకం చేపట్టింది.ధ్రువీకరణ పత్రాలు,భూ సమస్యలు,రెవెన్యూ పనులు చూసేందుకు అనునిత్యం గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల రెవిన్యూ పరమైన సమస్యలు నెరవేర్చేందుకు జీపీవోలు ముందుండాలని దృఢ సంకల్పంతో జిపిఓల ఎంపిక ప్రక్రియ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. కానీ ఖమ్మం రూరల్ మండలం లోని, వీరి వృత్తికీ విరుద్ధంగా పనులు జరుగుతున్నాయి అనడంలో ఎలాంటి ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు.ఉమ్మడి రూరల్ మండలంలోని 15 మంది జీపీవో లు ఉండగా ప్రజా సమస్యలు పక్కనపెట్టి గ్రామాల్లో ఉండవలసిన జీపిఓలు తహసిల్దార్ కార్యాలయంలో కాలక్షేపం చేస్తున్నారని,మండలం లోని పలు గ్రామాలలో ప్రజలు వాపోతున్నారు.గ్రామాలలో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురికావాల్సి వస్తుందని గ్రామాలలోని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రజా సమస్యలు పక్కదారి**

గ్రామాలలో ప్రజల సమస్యలు పక్కన పెట్టి తహసీల్దార్ కార్యాలయం లో దర్జాగా ముచ్చట్లతో కాలక్షేపం చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో ఉండవలసిన జీపీవో లు అందుబాటులో లేకపోవడంతో ప్రతి చిన్నపనికి తహసీల్దార్ కార్యాలయంకు రావాల్సి వస్తుంది. దీనితో రెక్కడితే డొక్కాడని ప్రజలు ఒకవైపు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది.మంగళవారం గోళ్ళపాడు గ్రామానికి చెందిన వృద్ధుడు గంటల తరబడి పంచాయతీ కార్యాలయం ఉన్నారు.తనకున్న ఓ కొద్దీ వ్యవసాయ భూమి సమస్య విషయం గురించి పంచాయతీ కార్యాలయంకు జీపీవో కోసం రాగ స్థానిక ఓ పార్టీ కీ చెందిన నాయకుడు ఫోన్ లో సంప్రదించగా ఈరోజు నేను గ్రామం లోకి రాలేదని, రేపు కూడా వస్తానో రానో తెలియదని ఏమైనా అవసరం ఉంటే తహసీల్దార్ కార్యాలయంకు రావాలని జవాబు ఇచ్చారు.

**ప్రైవేట్ వ్యక్తులతో కార్యాలయనికి దరఖాస్తులు**

మండలం లోని పలు గ్రామాలకు చెందిన ప్రైవేట్ వ్యక్తులతో తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు లు తెప్పించుకొని కార్యాలయంలోనే సంతకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.వివిధ రకాల సర్టిఫికెట్స్ కోసం దరఖాస్తులు పెట్టుకున్న ప్రజలకు గ్రామాల్లో అందుబాటులో లేకుండా తహసీల్దార్ కార్యాలయం లో మకాం వేస్తున్నారని గ్రామాలలోని ప్రజలు వాపోతున్నారు.తహసీల్దార్ ఇప్పటికైనా జీపీవోల మీద చర్యలు తీసుకోని గ్రామలలో అందుబాటులో వుండే విదంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## ఘనంగామాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు

**చంద్రుగొండ, జూన్ 16 (జనంసాక్షి):** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను చంద్రుగొండ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మెచ్చా నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు దారా వెంకటేశ్వరరావు, గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, జిల్లా నాయకులు మేడ మోహనరావు, భూపతి రమేష్, పట్టణ అధ్యక్షులు సురా వెంకటేశ్వర్లు, మండల మహిళా నాయకురాలు సోలం రజనీకుమారి, మద్దుకూరు ఉప సర్పంచ్ బడికల శ్రవణ్ కుమార్, గుర్రాయిగూడెం ఉప సర్పంచ్ శీలం రమేష్ రెడ్డి, బెండలపాడు పంచాయతీ ఉప సర్పంచ్ బానోతు బాలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



**మోటకొండూరు/జూన్ 16( జనంసాక్షి):** మండల పరిధిలోని చామపూర్ గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ఓపాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు యెల్లంల శ్రీధర్ రెడ్డి తన వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టివేయగా ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. రోజు వారిలాగే తన వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టివేయగా ప్రమాదవ శాత్తు విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లు తగలడంతో ఆవు అక్కడికక్కడే మృత్యువాత పడింది. చేతికొచ్చిన పాడి ఆవు కళ్లెదుటే మృతి చెందడంతో రైతు శ్రీధర్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పాడి ఆవును కోల్పోయి ఆర్థికంగా నష్టపోయిన తనను సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.



## ముందస్తుగా యూరియా స్టాక్‌ను అందుబాటులో ఉంచాలి

**మాడ్గులపల్లి ఏవోకు సర్పంచులు, రైతుల వినతి పత్రం**

**మాడ్గులపల్లి, 16 ( జనం సాక్షి):** రాబోయే సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి కొరత లేకుండా ముందస్తుగానే యూరియా ఎరువులను అందుబాటులో ఉంచాలని కన్నెకల్, ధర్మాపురం పరిధిలోని 7 గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు మాడ్గులపల్లి మండల వ్యవసాయ అధికారి కి విజ్ఞప్తి చేశారు మంగళవారం కన్నెకల్ సర్పంచ్ సంద్రాల నాగరాజు, ధర్మాపురం సర్పంచ్ కొత్త దశరథ ల ఆధ్వర్యంలో రైతులతో కలిసి అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా సర్పంచులు సంద్రాల నాగరాజు, కొత్త దశరథ మాట్లాడుతూ కన్నెకల్ పాత గ్రామ పంచాయతీ, ధర్మాపురం పరిధిలోని 7 గ్రామాల్లో దాదాపు 10,000 ఎకరాల సాగు విస్తీర్ణం ఉందని, సుమారు 3,280 మంది రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు ప్రస్తుత సీజన్‌లో ఎకరానికి రెండు బస్తాల చొప్పున మొత్తం 20,000 బస్తాల యూరియా అవసరమవుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.రైతుల ఇబ్బందులను నివారించేందుకు గాను, మొత్తం యూరియా కోటాలో 80 శాతాన్ని కన్నెకల్ పరిధిలోని ఎన్ డి సి ఎం స్,ఎఫ్ పి ఓ ల ద్వారా రైతులకు నేరుగా కేటాయించాలని, మిగిలిన 20 శాతాన్ని ప్రైవేట్ దుకాణాలకు ఇవ్వాలని వారు కోరారు గత సీజన్లలో యూరియా సకాలంలో దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఈ సారి అలాంటి పరిస్థితులు రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ సమస్యను సీరియస్‌గా పరిగణించి రైతులకు యూరియా కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మత్స్యగిరి గుట్టనూతన ఈవో గా వెంకటయ్య



**వలిగొండ, జున్ 16( జనంసాక్షి)** మండలంలోని వెంకటాపురం గ్రామం పరిధిలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన ఈ వో గా కొత్తపల్లి వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందించగా, సిబ్బంది ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# ప్రభుత్వ బడులే ముద్దు.. ప్రైవేటు బడులు వద్దు

- యూపీఎస్ పెంట్లంలో కార్పొరేట్ స్థాయి వసతులు
- విద్యార్థుల కోసం ఉపాధ్యాయులే ఆటో సౌకర్యం
- నాణ్యమైన విద్యతో పాటు ఉచిత సదుపాయాల కల్పన



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 16 (జనంసాక్షి)** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలు విద్యారంగంలో విశేష సేవలందిస్తున్నాయని యూపీఎస్ పెంట్లం ప్రధానోపాధ్యాయులు టి. నారాయణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు చేపడుతున్న చేరికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన తల్లిదండ్రులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (యూపీఎస్) పెంట్లంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విశాలమైన ఆటస్థలం, ప్రశాంతమైన విద్యా వాతావరణం, పరిశుభ్రమైన పరిసరాలు, విద్యుత్ సౌకర్యాలు, ఫ్యాన్లతో కూడిన తరగతి గదులు విద్యార్థుల అభ్యాసానికి అనుకూలంగా ఉన్నాయని వివరించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రతిరోజూ వేడివేడి భోజనం అందించడంతో పాటు వారానికి మూడు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు రాగిజావా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వం తరఫున ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, యూనిఫారాలు విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసే అవసరం లేకుండానే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయని చెప్పారు. విద్యార్థుల రవాణా సౌకర్యార్థం ఉపాధ్యాయులే స్వచ్ఛందంగా ఆర్థిక సహకారం అందించి ఆటో సౌకర్యాన్ని కల్పించడం పాఠశాల ప్రత్యేకతగా నిలిచిందన్నారు. విద్య కోసం ఉపాధ్యాయులు చూపుతున్న అంకితభావాన్ని గ్రామ ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు."ఖర్చు లేని నాణ్యమైన చదువు ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యం" అని పేర్కొన్న హెచ్‌ఎం టి. నారాయణ, గ్రామంలోని ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



ప్రభుత్వ బడులను ఆదరించడం ద్వారా పిల్లల భవిష్యత్తుతో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడిన వారవుతారని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలపై పెరుగుతున్న విశ్వాసంతో యూపీఎస్ పెంట్లంలో విద్యార్థుల చేరికలు క్రమంగా పెరుగుతున్నాయని పాఠశాల వర్గాలు తెలిపాయి. గ్రామ ప్రజలు ప్రభుత్వ విద్యను ప్రోత్సహించి తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.



## దాసాంజనేయునికి అభిషేకం.. రామయ్యకు కల్యాణం

భద్రాచలం జూన్ 16 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం దాసాంజనేయస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకరబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే మచ్చా జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు..



దమ్మపేట జూన్ 16 (జనంసాక్షి):
బిఆర్ఎస్ పార్టీ అశ్వరావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే,నియోజకవర్గ ఇన్చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను దమ్మపేట మండల కేంద్రంలోని ఘనంగా నిర్వహించారు. మెచ్చా అభిమానులు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామి గుడి వద్ద మెచ్చా నాగేశ్వరరావు పేరు మీద ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిపించారు.అనంతరం మండల బిఆర్ఎస్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.మెచ్చా జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల నందు రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి మెచ్చా నాగేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. ప్రజల మనిషిగా ఆయన అందరికీ అందుబాటు లో ఉంటారని,ఆయన నిండు నూరేళ్ళ ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లి ఖార్జున రావు, మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసు బాబు,దారా యుగంధర్, జలగం వాసు, నాయకపోడు సంఘం రాష్ట్ర నాయకులు రావుల శ్రీనివాసరావు,వార్డు సభ్యులు దారా రాము, ఉయ్యాల లక్ష్మీ నారాయణ,రూపా రాంబాబు, బుడే,అ బ్దుల్ జిన్నా,మాజీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు,ఉద్యమ నాయకులు గాజుబోయిన శ్రీను,వల్లేపు నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు మద్దెల పుల్లారావు, వెలుగోటి మహేష్,మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా న్యాయమూర్తి శివనాయక్ జన్మదిన వేడుకలు

### భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో



భద్రాచలం జూన్ 16 (జనంసాక్షి)
భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివనాయక్ జన్మదిన వేడుకలు మంగళవారం భద్రాచలం కోర్టు ఆవరణలో వేద పండితుల ఆశీర్వచనంతో ఘనంగా నిర్వహించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం కోర్టు ఆవరణలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాభవాని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసా చారి, జాయింట్ సెక్రెటరీ తాతా లలిత, కోశాధికారి దన్నాన రాము, లేడీ రిప్రజెంటేటివ్ ఎం తరుణి, సీనియర్ న్యాయవాదులు ఎంవి రమణారావు, గోడపర్తి నాగరాజు, రావి రామ్మోహన్, ఆర్. జయరాజ్ , పీ మస్తాన్ బాబు, అరుణ్ చంద్, అరుణ శ్రీ, తిరుమల రావు, అవునూరు సత్యనారాయణ, ఎంవి రమణ, ఎస్ మల్లేష్, నర్సద్దా, ఎస్ సతీష్, పి రవి వర్మ, గౌతమ్, వలవల సురేష్, వి రవితేజ, గాయత్రి, కారం రమేష్ బి తదితర న్యాయవాదులు ప్రతినిధులు, తోటి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని న్యాయమూర్తి కి ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రాలు

### అడిషనల్ డీసీపీ రామానుజం



ఖమ్మం, జూన్ 16, (జనంసాక్షి) :
చిన్నారులపై హింసను అరికట్టడంతో పాటు హింస, లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సమగ్ర సేవలు అందించడంలో భరోసా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తూ వారికి అండగా నిలుస్తున్నాయని అడిషనల్ డీసీపీ రామానుజం తెలిపారు. బాధిత మహిళలు, చిన్నారులకు భరోసా కేంద్రాల ద్వారా అందించే సహాయం, పునరావాస సేవలను మరింత బలోపేతం చేయడానికి వివిధ శాఖల అధికారులతో పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హింసకు గురైన మహిళలు, చిన్నారులకు పోలీసు, వైద్య, న్యాయ, మానసిక సలహా సేవలను ఒకే చోట అందించడం ద్వారా వేగవంత మైన సహాయం అందుతోందన్నారు. బాధితులు మళ్లీ ఇలాంటి ఘటనల బారిన పడకుండా చూడడమే భరోసా కేంద్రాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. లైంగిక వేధింపులు, గృహహింసకు గురైన మహిళలు, పిల్లలకు తక్షణ రక్షణతో పాటు వైద్య, న్యాయ, సలహా, పునరావాస సేవలను అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. బాధితులకు అవసరమైన అన్ని సేవలు సమన్వయంతో అందించేందుకు పోలీసు, రెవెన్యూ, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు ఒకే ప్రాంగణంలో పనిచేస్తారని చెప్పారు. పోలీసు స్టేషన్లు, న్యాయస్థానాల వాతావరణానికి దూరంగా బాధితులకు భయం లేకుండా సురక్షితమైన, గోప్యమైన వాతావరణంలో సేవలు అందిస్తున్నామన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలతో పాటు నిపుణులైన మనోవైద్యుల ద్వారా సలహా సేవలు అందించి బాధితుల్లో మనోధైర్యం పెంపొందిస్తున్నామని వివరించారు. ఫిర్యాదు నమోదు నుంచి న్యాయ విచారణ పూర్తయ్యే వరకు న్యాయ నిపుణుల ద్వారా ఉచిత సహాయం అందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వల్ప కాలిక ఆశ్రయం, విద్యా సౌకర్యాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి శిక్షణ ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సమగ్ర బాలల పరిరక్షణ పథకం అధికారులు, బాలల సహాయవాణి ప్రతినిధులు, బాలల సంక్షేమ సంఘం సభ్యులు, జిల్లా న్యాయ సేవల సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ న్యాయవాదులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సలహాదారులు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలి రైతు సంఘం



పెనుబల్లి, జూన్ 16 (జనంసాక్షి)
రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో పెనుబల్లి వ్యవసాయ అధికారికి మంగళ వారం వినతి పత్రం అందజేశారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందక పోవడం వల్ల రైతులు వేసిన పంట పొలాలు దిగుబడి లేక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని, నకిలీ ఎరువులు పురుగుమందులు గుర్తించి సంబంధిత విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రైతుల పంట పొలాలకు సరిపడా విత్తనాలు తో పాటు యూరియా కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో రైతు సంఘం నాయకులు చిట్టి మొదల కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విత్రప్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు, రైతు సంఘం నాయకులు చిమట విశ్వనాథం, కండి సత్యం, ప్రతాప్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన స్టాప్ డయేరియా క్యాంపెయిన్



ఖమ్మం కార్పొరేషన్, జూన్ 16 (జనంసాక్షి)
ఈరోజు ఖమ్మంలో నిర్వహించిన ఆశ నోడల్ ఆఫీసర్ల సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రామారావు పాల్గొని నోడల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.
ఈ సందర్భంగా డా. రామారావు మాట్లాడుతూ, ఈరోజు నుండి ప్రారంభమైన స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ? 2026 కార్యక్రమంలో ఆశా కార్యకర్తలందరూ చురుకుగా పాల్గొని గ్రామాలు, వార్డుల్లో ప్రజలకు పారిశుద్ధ్యం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ఓఆర్ఎస్ ద్రావణం వినియోగం, జింక్ మాత్రల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బందితో సమన్వయంగా పనిచేసి, 0?5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
అదేవిధంగా జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి, లక్షిత పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం డా. రామారావు గారు ఖమ్మం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన సూచనలు చేశారు.అదేవిధంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్, పల్స్ పోలియో కార్యక్రమం మరియు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సంబంధిత సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన ఆదేశించారు.

## దేశాభివృద్ధికి మూడు కీలక స్తంభాలు..

# విద్య, వైద్యం, వ్యవసాయం

### ఈ మూడు రంగాలు బలోపేతమైతేనే సమాజ ప్రగతి

### ప్రభుత్వాల ప్రాధాన్యతతోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల

**అన్నపురెడ్డిపల్లి జూన్ 16 (జనంసాక్షి)**
ఒక దేశం అభివృద్ధి చెందాలంటే కేవలం పరిశ్రమలు, భవనాలు, రహదారులు నిర్మించడం మాత్రమే సరిపోదు. ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విద్య, వైద్యం, వ్యవసాయం అనే మూడు ప్రధాన రంగాలు బలోపేతం కావాలి. ఈ మూడు రంగాలే సమాజానికి వెన్నెముకలుగా నిలుస్తాయి.

**విద్యే భవిష్యత్తుకు పునాది**
విద్య మనిషికి జ్ఞానాన్ని, వివేకాన్ని అందిస్తుంది. చదువుకున్న సమాజం మాత్రమే అభివృద్ధి దిశగా అడుగులు వేయగలదు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన బోధన, సాంకేతిక విద్య అందుబాటులోకి వస్తే పేద విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.
"ఒక మంచి పాఠశాల వంద జైళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటుంది" అనే నానుడి విద్య ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

**వైద్యం.. ప్రాణాలను కాపాడే వ్యవస్థ**
ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన మాట నేటికీ సత్యమే. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. వైద్యులు, సిబ్బంది, మందులు, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంటే ప్రజల ఆరోగ్య సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. ఆరోగ్యవంతమైన ప్రజలే దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలరు. అందుకే వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**వ్యవసాయం.. దేశానికి అన్నపూర్ణ**
వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారం. రైతు పండించిన పంటలతోనే దేశ ప్రజల ఆకలి తీరుతుంది. వర్షాధార వ్యవసాయం నుంచి ఆధునిక సాంకేతిక వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేస్తున్నప్పటికీ, ఇంకా అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు.
సాగునీటి వసతులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధరలు, పంట బీమా వంటి అంశాల్లో ప్రభుత్వాలు రైతులకు అండగా నిలవాలి. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.

**మూడు రంగాల సమన్వయమే సమగ్ర అభివృద్ధి**
విద్యతో అవగాహన పెరుగుతుంది. వైద్యంతో ఆరోగ్యం మెరుగవుతుంది. వ్యవసాయంతో ఆహార భద్రత సాధ్యమవుతుంది. ఈ మూడు రంగాలు సమన్వయంతో అభివృద్ధి చెందితేనే గ్రామీణాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.
దేశ భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దేది విద్య, ప్రజల ప్రాణాలను కాపాడేది వైద్యం, ప్రజల ఆకలి తీర్చేది వ్యవసాయం. అందుకే ఈ మూడు రంగాలను బలోపేతం చేయడం ప్రతి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య కర్తవ్యంగా మారాలి. విద్య, వైద్యం, వ్యవసాయం బలపడితేనే దేశం సుభిక్షంగా ముందుకు సాగుతుంది.







## దమ్మపేటలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

### ఎమ్మార్వో రామ్ నరేష్ ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు..

**దమ్మపేట జూన్ 16 (జనంసాక్షి):**
దమ్మపేట మండలం గణేష్ పాడు గ్రామ శివారులో ప్రభుత్వ ఆధీనంలో గల నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని నాలుగు కుంటల ప్రభుత్వ భూమిని ఖమ్మం జిల్లా,సత్తుపల్లి మండలం,రామ గోవిందాపురం గ్రామానికి చెందిన ఊకె రాములు, కణసాని జగ్గా చారి తండ్రి లక్ష్మాచారి అను ఇద్దరు వ్యక్తులు అట్టి ప్రభుత్వానికి చెందిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి వరి పంట సాగు చేసి ప్రభుత్వానికి చెందిన వరి పంటను కోశారు. ఇట్టి విషయం తెలుసుకున్న దమ్మపేట మండల తాసిల్దార్ రామ్ నరేష్ సంఘటన స్థలానికి చేరుకుని అన్యక్రాంతంగా ప్రభుత్వ భూమిలోకి జొరబడిన ఇద్దరు వ్యక్తులపై దమ్మపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అభినంధించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం కార్పొరేషన్ జూన్ 16( జనంసాక్షి)**
చిన్నారులపై లైంగిక వేధింపులు పోక్సో కేసుల్లో, గంజాయి వంటి తీవ్రమైన NDPS కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించడం, ప్రాసిక్యూషన్, పోలీసుల సమన్వయం తో నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ... నేరస్థులకు జీవిత ఖైదు, 20 ఏళ్ల జైలు శిక్ష మొదలు అనేక కఠిన కారాగారా శిక్షలు పడేలా కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాదిలో ఇప్పటికే ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు అయిన ఐదు పోక్సో కేసుల్లో ఖమ్మం అర్బన్ కేసు లో నిందుతుడికి జీవిత ఖైదు, రఘునాథపాలెం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష, ఖమ్మం రూరల్ రెండు వేర్వేరు కేసులో ఏడు, ఐదు సంవత్సరాల జైలు, రఘునాథపాలెం కేసులో మూడు సంవత్సరాల ఆరు నెలల శిక్ష పడ్డాయి. అదేవిదంగా గంజాయి వంటి 10 NDPS కేసుల్లో ఆరు కేసుల్లో 20 ఏళ్ల కఠిన కారాగారా శిక్ష, మరో రెండు కేసుల్లో 10 ఏళ్ల జైలు, ఒక కేసులో ఏడు ఏళ్ల జైలు, రెండు కేసుల్లో ఏడాది వరకు జైలు శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ అభినందించారు.



## పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న

# మినరల్ వాటర్ ప్లాంట్లు

### నిబంధనలకు తూట్లు.. అధికారుల పర్యవేక్షణ శూన్యం!

### ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా..?

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 16 (జనంసాక్షి)**
మండల కేంద్రం సహా పరిసర గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పెరుగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి అవసరాలను ఆసరాగా చేసుకుని అనుమతులు, నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత నియమాలను పూర్తిగా పాటించకుండా కొందరు మినరల్ వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మినరల్ వాటర్ పేరుతో సరఫరా చేస్తున్న నీరు నిజంగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందా లేదా అనే అంశంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని ప్లాంట్లలో నీటి శుద్ధి యంత్రాల నిర్వహణ సరిగా లేకపోవడం, నీటి నిల్వ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటం, కేన్ల శుభ్రతపై నిర్లక్ష్యం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీరు నేరుగా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో నాణ్యత లేని నీటి సరఫరా వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణకు అవసరమైన అనుమతులు, నీటి నాణ్యత పరీక్షలు, పరిశుభ్రత ప్రమాణాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు పాటించని ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.




## నూర్ భాషా దూదేకులపై వదంతులు నమ్మొద్దు

**ఖమ్మం, (జనంసాక్షి) :**
నూర్ భాషా దూదేకుల కులస్తులను 'పింజారి'గా మారుస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని తెలంగాణ బీసీ కమిషన్ స్పష్టం చేసినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ విషయమై బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా, కులాల జాబితాలో ఎలాంటి మార్పులు చేయలేదని ఆయన వెల్లడించినట్లు పేర్కొన్నారు.

దీంతో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని నూర్ భాషా దూదేకుల కులస్తులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో నూర్ భాషా దూదేకుల జనాభా వివరాలు ప్రత్యేకంగా నమోదు అయ్యేలా కేంద్ర బీసీ కమిషన్‌కు ప్రాతినిధ్యం వహించాలని కోరగా, ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన కమిషన్ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇతర సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ భాషా, ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడే సాహెబ్ పాల్గొన్నారు.

# ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

◆ మండలం లో ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

◆రైతులకు యూరియా బుకింగ్ యాప్ పై అవగాహన

◆మిర్యాలగూడ ఏడీఏ కె. జగదీష్ రెడ్డి



మాడుగులపల్లి, జూన్ 16( జనం సాక్షి ): మండల పరిధిలోని కన్నెకల్ గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను మిర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) కె. జగదీష్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా దుకాణాలు, గోదాముల్లోని ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించారు అనంతరం స్టాక్ రిజిస్టర్లను, విక్రయాల బిల్లులను ఈ-పాస్ మిషన్లలో నమోదైన నిల్వల వివరాలను నిశితంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఏడీఏ జగదీష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని డీలర్లు రైతులకు ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించారు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే యూరియా, ఇతర ఎరువులను విక్రయించాలని స్పష్టం చేశారు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించినా డీలర్‌షిప్ రద్దు చేయడంతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు అనంతరం కన్నెకల్ రెవెన్యూ పరిధిలోని సర్పంచులు, రైతులతో ఏడీఏ సమావేశమయ్యారు రైతులకు సులభంగా ఎరువులు లభించేలా ప్రభుత్వం రూపొందించిన యూరియా బుకింగ్ యాప్ పనితీరుపై వారికి అవగాహన కల్పించారు యాప్ ద్వారా ఎరువులను ఎలా బుక్ చేసుకోవాలో వివరిస్తూ, రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు ఈ కార్యక్రమంలో కన్నెకల్ సర్పంచ్ సర్నాల నాగరాజు, ధర్మపురం సర్పంచ్ కొత్త దశరథ, మాడుగులపల్లి మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శివరాం కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సంతోష్ గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడిపితే కఠిన చర్యలు..

ఎం. వి. ఐ. వీరేంద్ర నాయక్





జనంసాక్షి, మిర్యాలగూడ : ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సు లు నడిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ బి. వీరేంద్రనాయక్ అన్నారు మంగళవారం నాడు పట్టణంలోని హనుమాన్ పేట ఫ్లై ఓవర్ వద్ద ఒక ఫిట్నెస్ లేని స్కూల్ బస్సుపై కేసు నమోదు చేశామన్నారు. మిర్యాలగూడ ఆర్టీవో పరిధిలో సుమారు 335 స్కూల్ బస్సులున్నట్టు గుర్తించామని వాటిలో ఇప్పటివరకు 258 బస్సులను పరిశీలించి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చామని ఆయన తెలిపారు. స్కూల్ యాజమాన్యం బస్సులకు ఫిట్నెస్ లేకుండా విద్యార్థులను తీసుకుని తిరిగితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు . మిగిలి ఉన్న 77స్కూల్ బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకుని సురక్షితంగా విద్యార్థులను చేర్చాలని, అదేవిధంగా బస్సులలో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఓవర్ లోడ్ గా ఎక్కించ వద్దని కోరారు. కార్యక్రమంలో ఎంవిఐ అలీ, సిబ్బంది ఉన్నారు.

## రేపూరులో దేవాలయ వ్యవసాయ భూముల సర్వే

ఈవో నాగెళ్ల శంబిరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన



మేళ్లచెరువు జనం సాక్షి : మండలంలోని రేపూరు గ్రామంలో దేవాలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాగెళ్ల శంబిరెడ్డి శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన వ్యవసాయ భూములను సర్వే చేయించారు.సర్పంచ్, గ్రామ పెద్దలు, కౌలు రైతుల సమక్షంలో ఈరోజు దేవాలయ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లోకల్ సర్వే ద్వారా భూముల హద్దులు, సర్వే నంబర్లు, విస్తీర్ణం గుర్తించారు.ఈ సందర్భంగా ఈవో నాగెళ్ల శంబిరెడ్డి మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన వెంటనే దేవాలయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కౌలు రైతుల వివరాలు, కౌలు బకాయిల రికార్డులు సరిచూసి పారదర్శకంగా నిర్వహిస్తామని చెప్పారు. దేవుడి మాన్యాలను కాపాడటం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, కౌలు రైతులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

### ఓటరు నమోదు ప్రక్రియలో

# బి ఎల్ ఏ ల పాత్ర అత్యంత కీలకం

### ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



దేవరకొండ,జూన్ 16(జనం సాక్షి ) ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు కీలక బాధ్యతను నిర్వహించాల్సి ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటర్ల హక్కులను పరిరక్షించడంలో బి ఎల్ ఏ ల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు.దేశవ్యాప్తంగా అమలు చేయనున్న సర్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయడం ద్వారా దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలు, యువత మరియు మహిళల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి బి ఎల్ ఏ తన బూత్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని, ఏవైనా లోపాలు లేదా సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఓటర్ల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల సహకారంతో ఎదుర్కొంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ మండలాల బి ఎల్ ఏ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఫర్జానా బేగం మృతి బాధాకరం

చింతపల్లి, జూన్ 16(జనంసాక్షి) చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మదర్ హుస్సేన్ సతీమణి శ్రీమతి ఫర్జానా బేగం అనారోగ్య కారణాలతో నిన్న మరణించిన విషయం తెలుసుకున్న దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఫర్జానా బేగం చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె మృతిపట్ల ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, మాజీ సర్పంచ్ గోవర్ధన్, మాస భాస్కర్, రామిని నగేష్, మద్దెల కృష్ణ, ఉప సర్పంచ్ కలీల్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రహీమ్, రాజేష్, మల్లేష్, కృష్ణ, నయీమ్, వార్డ్ సభ్యులు శంకర్, బుజ్జి, పాలకూర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ అభినందన సభకు తరలి రండి

కోదాడ,( జనం సాక్షి): కోదాడ పట్టణం స్థానిక పబ్లిక్ క్లబ్ ఆవరణ యందు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యపేట జిల్లా సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు హాజరై మాట్లాడుతూ ఈనెల 28న జరిగే కొడంగల్ అభినందన యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తానన్న హామీ ప్రకారం కేకే కమిటీని ఏర్పాటు చేసినందుకు తొందరలోనే ఉద్యమకారులందరికీ న్యాయం చేసే దిశగా కమిటీ ప్రణాళికలు రచిస్తున్న సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందన యాత్ర కొడంగల్ కార్యక్రమానికి ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల రామారావు, భూపాల్,జోగు. అంజన్న,పుల్లారి. అచ్చయ్య,తుపాకుల భాస్కర్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మజహర్, కోదాడ నియోజకవర్గ ఉద్యమకారుల ఫోరం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా విద్యా బోధన

సూర్యాపేట (జనంసాక్షి): 2026 -27 విద్యా సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ విద్యా నిలయంలో సరస్వతి హోమం, గాయత్రి హోమంను మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పర్వతం శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ సరస్వతి విద్యా నిలయంలో ఇంగ్లీష్ మీడియం మాధ్యమంగా చిన్నారులకు చక్కటి విద్యుతో పాటు సంస్కార దేశభక్తి నైతిక విలువలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా సంస్కారయుక్త విద్యను అందిస్తామని తెలిపారు.భారతీయ విద్యా తత్వాన్ని అనుసరిస్తూ సంస్కృతి పరిరక్షణ, జ్ఞానంతో పాటు సమాజానికి ఉపయోగపడే తరాన్ని నిర్మించడానికి సరస్వతీ విద్యా నిలయం కృషి చేస్తుందని తెలిపారు.తమ పాఠశాలను ఆశీర్వదించి పాఠశాల అభివృద్ధి కొరకు తోడ్పడాలని కోరారు.చదువులతల్లి శ్రీసరస్వతి మాత ఆశీస్సులు లభించాలని నిర్వహించిన ఈ యజ్ఞంలో పాఠశాల ప్రబంధ కార్మిణి సభ్యులు కొత్త మల్లికార్జున్,గట్ల సోమయ్య, పోతుగంటి లక్ష్మీనారాయణ,మాదిశెట్టి విజయ్ కుమార్,



ప్రధానోపాధ్యాయులు కర్పూరం కవిత, ఉపాధ్యాయులు స్వాతి,ప్రియాంక,ఉష,రమ్య,దుర్గ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జనం సాక్షి ఇంపాక్ట్:కదిలిన యంత్రాంగం

## పెద్దవూరలో విత్తన దుకాణాలపై అధికారుల ఆకస్మిక తనిఖీలు

**జనం సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు**

**రంగంలోకి దిగిన తహశీల్దార్ కాశీం నాయక్, ఎస్ఐ గోపాల్ రావు**

**వ్యవసాయ అధికారి సత్యనారాయణ**

**నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**పెద్దవూర, జూన్ 16 (జనంసాక్షి)**
రబీ సీజన్ ప్రారంభ వేళ నకిలీ విత్తనాలు నాసిరకం పురుగుమందుల విక్రయాల వల్ల రైతులకు పొంచి ఉన్న ప్రమాదంపై, అధికారుల తనిఖీల లోపంపై 'జనం సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న ఆందోళనను ఎత్తిచూపుతూ ప్రచురించిన వార్తతో కదిలిన అధికారులు మంగళవారం పెద్దవూర మండల కేంద్రంలోని పలు సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు
పెద్దవూర తహశీల్దార్ కాశీం నాయక్ స్థానిక ఎస్ఐ గోపాల్ రావు తమ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను క్షుణ్ణంగా పరిశీలించారు దుకాణాల్లోని నిల్వలు వాటి లైసెన్సులు స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ డేట్) పురుగుమందులు అనుమతులు లేని కంపెనీల విత్తనాలు విక్రయిస్తున్నారా అనే కోణంలో రికార్డులను సరిచూశారు.ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తాం అని తహసిల్దార్ కాశీం నాయక్ స్పందించారు .ఈ సందర్భంగా తహశీల్దార్ కాశీం నాయక్ మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు యజమానులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆదేశించారు లైసెన్స్ కలిగిన గుర్తింపు పొందిన కంపెనీల ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలన్నారు దుకాణాల్లో ధరల పట్టికను ప్రదర్శించాలని నిల్వలు గడువు తేదీలను నిరంతరం పరిశీలించుకోవాలని సూచించారు నిబంధనలు ఉల్లంఘించి నకిలీ నాసిరకం విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసం చేయాలని చూస్తే దుకాణాలను సీజ్ చేయడమే కాకుండా సదరు వ్యాపారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**రైతులకు బిల్లులు ఇవ్వడం తప్పనిసరి. ఎస్ఐ గోపాల్ రావు**

ఎస్ఐ గోపాల్ రావు మాట్లాడుతూ వ్యాపారులు ప్రతి కొనుగోలుపై రైతులకు తప్పనిసరిగా పక్కా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు అక్రమ నిల్వలు ఉంచినా నకిలీ ముఠాలతో చేతులు కలిపి నకిలీ విత్తనాలను మార్కెట్లోకి తెచ్చినా సహించేది లేదన్నారు రైతులు కూడా విత్తనాలు కొనేటప్పుడు కంపెనీ పేరు బ్యాచ్ నంబర్ గడువు తేదీలను గమనించాలని బిల్లులను జాగ్రత్తగా దాచుకోవాలని కోరారు ఎక్కడైనా నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా వారి శ్రమ వృథా కాకుండా ఉండేందుకు నిరంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు. 'జనం సాక్షి' పత్రిక సామాజిక బాధ్యతతో స్పందించి కథనాన్ని ప్రచురించడం పట్ల దానికి తక్షణమే స్పందించి తనిఖీలు చేపట్టిన అధికారుల తీరు పట్ల మండల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.






## ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

### మండల అధ్యక్షులుగా కేమ విష్ణుమూర్తి

**భూదాన్ పోచంపల్లి, జూన్ 16:**
భూదాన్ పోచంపల్లి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పట్టణ కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు భోగ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్న ఏకీకృత ధరల పట్టికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న ఏఐ సాంకేతికత ఫోటోగ్రాఫర్ల జీవనోపాధిపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమలవుతున్న "కుటుంబ భరోసా" పథకం ద్వారా సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రామన్నపేటలో ప్రమాదంలో మరణించిన ఫోటోగ్రాఫర్ నకిరికంటి మహేష్ కుటుంబానికి కుటుంబ భరోసా పథకం కింద రూ.4.10 లక్షల ఆర్థిక సహాయం త్వరలో అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మాజీ అధ్యక్షులు దోర్నాల గణేష్ అధ్యక్షత వహించగా, నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా కేమ విష్ణుమూర్తి, ఉపాధ్యక్షులుగా చెక్క మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా రవ్వ నవీన్, కోశాధికారిగా సకినాల సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శిగా దొడ్డమోని వంశీధర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్ల హరి రెడ్డి, కోశాధికారి తూనిక దశరథ, ఉపాధ్యక్షుడు ఎర్రోజు యజ్ఞమాచారి, గౌరవ సలహాదారు వల్లంశెట్టి సతీష్, సలహాదారు రచ్చ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల పేరుతో రాజకీయాలు చేయడం మానుకోవాలి

### జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిటిసి ఎండి రెహన్

**రామన్నపేట, జూన్ 16 (జనంసాక్షి):**రైతుల పేరుతో రాజకీయాలు చేయడం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ ఎంపిటిసి ఎండి రెహాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల సమస్యలపై అసత్య ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం ధాన్యం కొనుగోళ్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు అయ్యే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు.నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. రామన్నపేట మండలంలో పంట దిగుబడి ఎక్కువగా రావడం మండలానికి మూడు రైస్ మిల్లు ఉండడం మూలంగా లారీల కొరత, మిల్లులో అన్లోడింగ్ సమస్య ఉండటం వల్ల తక్షణమే స్పందించి నల్గొండ జిల్లా లోని107 మిల్లులతో మాట్లాడి కొనుగోళ్ళను వేగవంతం చేయడం జరిగింది. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యమును కొనుగోలు చేయడం జరుగుతుంది. ఇది తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తన రాజకీయ పబ్బం గడుపుకునేందుకు సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచార పోస్టులను నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు హాస్యనటుడు బ్రహ్మానందం నటన లాగా చూస్తున్నారన్నారు.అత్యధిక మెజార్టీతో గెలిపించిన నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పై చేస్తున్న విమర్శలను భాషను మార్చుకోకపోతే నకిరేకల్ ప్రజలు తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ విప్‌గా, ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహిస్తూ వ్యవసాయం పై మక్కువతో నేటికీ స్వయంగా వ్యవసాయ పనులు చేసుకుంటూ రైతుల కష్టాన్ని తెలిసిన వీరేశంపై రాజకీయ విమర్శలు చేయడం, నిందలు మోపడం హాస్యస్పదం అన్నారు. ఈ సమావేశంలో డిసిసి కార్యదర్శి అబ్రహం కుమార్, పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్, మాజీ పిసిసి కార్యదర్శి గోదాసు పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, మాజీ డిసిసిబి డైరెక్టర్ జెల్లా వెంకటేశం, ఎండి నాసర్, ఎండి అక్రమ్, కొమ్ము శేఖర్, ఏటేలి పరమేష్, నోముల ప్రవీణ్, గొరిగే శేఖర్, జువ్వాల శ్రీకాంత్, మేడి ధ్రువ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26000 వేలు ఇవ్వాలి

### జెర్రిపోతుల ధనంజయ

**చండూరు, జూన్ 16 (జనంసాక్షి)**
మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26000వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జెర్రిపోతుల ధనంజయ అన్నారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలోని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలోమున్సిపల్ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ఎల్. మల్లేశంకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి ప్రకటించి అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశల వారి పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందినీ, ఈనెల జూన్ 18 19 తేదీలలో మున్సిపల్ ఆఫీసుల వద్ద నిరాహార దీక్షలు చేయాలని, జూన్ 22వ తేదీన జిల్లా కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాలు చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.జూన్ 29 30 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు మంత్రుల ఇండ్ల ముందు ధర్నాలు చేపట్టాలని ఆయన అన్నారు.



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల మంది మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు పస్తులు ఉంటూ, అర్ధాకలితో జీవితాలు గడుపుతూ, అతి తక్కువ వేతనాలను పొందుతూన్న కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2 వ పిఆర్సి ప్రకటించి 26 వేల కనీస వేతనం అమలు చేయాలని కార్మిక సంఘాలు, కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడుతుంటే గత బిఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల ఆక్రందనలు పట్టించుకోకుండా, కనీస వేతనం 26000 పెంచకుండా కేవలం 16 వేల 600 ఇస్తూ మున్సిపల్ కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడుతూ, కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తప్పని పరిస్థితులలో మున్సిపల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులు పోరాట బాట పట్టాల్సి వచ్చిందని అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. కావున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిమాండ్లను జిల్లా పరిధిలో ఉన్న లోకల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దప దశల వారి కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగిందని అన్నారు. జూలై 12న హనుమకొండలో జరుగు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో తదుపరి పోరాట కార్యక్రమం చలో హైదరాబాద్, సమ్మె గురించి చర్చించి ప్రకటించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలన్నింటిని మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని, స్థానిక సమస్యలను మునిసిపల్ అధికార వర్గం వెంటనే పరిష్కరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు మొగుదాల వెంకటేశం, చిట్టిమల్ల లింగయ్య, సిఐటియు జిల్లా నాయకులు కత్తుల సైదులు, బీపంగి నాగరాజు, యాదయ్య, రేణుక,కలమ్మ, జంగమ్మ, వెంకన్నతదితరులు పాల్గొన్నారు.